# యువ దళం.. ఉప్పొంగిన అభిమానం



జమ్మికుంట చౌరస్తా నుంచి యువకులతో కలిసి బైక్ ర్యాలీగా వస్తున్న పాడి (ఫైల్)

- జమ్మికుంటలో యువ సమ్మేళనం విజయవంతం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పిలుపుతో భారీగా తరలివచ్చిన యువత
- ఐదు మండలాల నుంచి 5వేల మంది రాక
- బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టింపైన ఉత్సాహం

బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన 'యువ సమ్మేళనం' గ్రాండ్ సక్సెస్ అయింది. పాడి కౌశిక్‌రెడ్డి పిలుపుతో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి యువత భారీ ఎత్తున తరలివచ్చిన తమ అభిమానాన్ని చాటుకోగా, బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది.

*- జమ్మికుంట, అక్టోబర్ 28*

జమ్మికుంటలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభంతో పాటు యువ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి పిలుపు మేరకు కమలాపూర్, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల నుంచి 5వేల మందికి పైగా యువకులు వాహనాల్లో తరలివచ్చారు. పట్టణ పురవీధుల్లో బారులు తీరారు. తొలుత వీణవంక మండల కేంద్రంలో వాహనాలపై ర్యాలీ తీశారు. తర్వాత జమ్మికుంట చౌరస్తా నుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా యువత అభిమానం పోటెత్తింది. వేల సంఖ్యలో తరలివచ్చిన యువకులు పార్టీ జెండాలతో పాడికి ఘన స్వాగతం పలికారు. కేరింతలు కొట్టారు. పూల దండలు వేశారు. హాజరైన యువతకు కౌశిక్‌రెడ్డి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సభకు ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రాంగణం యువ దళంతో నిండిపోయింది. పార్టీ ఇన్‌చార్జిగా పెద్దిరెడ్డి, అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం యువతను ఆకట్టుకున్నది. పార్టీ గెలుపు కోసం యువతే కథానాయకులు కావాలని ఇచ్చిన పిలుపు యువతను ఉత్సాహపరిచింది. '30 రోజులు మీరు పనిచేయండి.. ఐదేళ్లు మీకు సేవ చేస్తా..' అంటూ యువతకిచ్చిన పాడి హామీపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. విజిల్స్, చప్పట్లతో సభా ప్రాంగణం మార్మోగింది. ఏదేమైనా యువ సమ్మేళనం విజయవంతం కావడంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమైంది.

## మద్యం పట్టివేత

జమ్మికుంట, అక్టోబర్ 28: జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని వావిలాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం దాడులు చేశారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, బత్తిని రాణి, పల్ల వెంకన్న, కటుకూరి సందీప్, వసంతపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సమావేశంలో స్థానిక సర్కిల్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్ఐ రమాదేవి, హెచ్‌సీ ఐలయ్య, పీసీలు పద్మావతి, విశ్వజ్ఞ, దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుల్స్ కుమార్ యాదవ్, సీహెచ్ రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో విద్యార్థులకు అభినందన



తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన రాకేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిని కరీంనగర్‌లో అభినందిస్తున్న జిల్లా అధికారులు

వీణవంక, అక్టోబర్ 28: చీరాలలో జరిగిన ఇంటర్ కాలేజీ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన మామిడాలపల్లి విద్యార్థులను శనివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న మండలంలోని మామిడాలపల్లికి చెందిన కూతురు రాకేశ్‌రెడ్డి, ఎడ్ల రవీందర్‌రెడ్డి చీరాలలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే రాజస్థాన్‌లో జరుగనున్న ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి అంజయ్య, ప్రధాన కార్యదర్శి బావు సంపత్, జాయింట్ సెక్రటరీ శ్రీధర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజవీర్, స్విమ్మింగ్ కోచ్ సంపత్, ప్రెసిడెంట్ ఎర్రోజు చందు, పీడీ సమ్మయ్య అభినందించారు.

# కాలమేదైనా జలకళ!



ఇప్పల్‌నర్సింగపూర్‌లో నీటితో కళకళలాడుతున్న గాజోని కుంట

- నిండుకుండలా ఇప్పల్‌నర్సింగాపూర్ గాజోని కుంట
- మిషన్ కాకతీయలో భాగంగా పునరుద్ధరణ

హుజూరాబాద్, అక్టోబర్ 28: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగపూర్ గాజోని కుంట ఎల్లప్పుడూ నీటితో నిండుకుండను తలపిస్తున్నది. నాడు ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో రూపురేఖలను కోల్పోయింది. వెరసి చిన్నపాటి వర్షం వచ్చి వరద నీరు చేరినా కుంట నిండి మత్తడి పోసేది. కుంట లోతు లేక కళ్ల ముందే నీళ్లు వృథాగా పోతుండడంతో రైతులు తండ్లాడిపోయారు. జనవరి ఆరంభంలోనే ఆ కుంట నెర్రెలు బారేది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకంతో గాజోనికుంటకు మహర్దశ వచ్చింది. రెండేళ్ల క్రితం సర్కారు రూ.22 లక్షల నిధులు కేటాయించగా కుంట కట్టను విస్తరించడంతోపాటు అడుగు మేర ఎత్తు పెంచారు. అలాగే శిథిలావస్థలో ఉన్న మత్తడికి మరమ్మతులు చేయడంతోపాటు కుంటలో పేరుకుపోయిన పూడిక తొలగించారు. ఇప్పుడు కుంటలో 80శాతం మేర నీళ్లు ఉండడంతో గ్రామస్తులు, రైతులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఇదివరకెవరూ పట్టించుకోలే



ఎప్పుడో తాతల కాలం నాడు గాజోని కుంట తవ్విన్రు. తర్వాత దాన్ని పట్టించుకునే టోళ్లు లేక పూడిక పేరుకు పోయింది. ప్రభుత్వం మిషన్‌కాకతీయ పథకంలో కుంటను బాగు చేయడంతో ఇప్పుడు బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నయ్. గతంలో ఈ సమయానికి కుంటలో మడుగుల్లో మాత్రమే నీళ్లు ఉండేవి.

*- గూడూరి జనార్దన్ రెడ్డి, రైతు (ఇప్పల్‌నర్సింగపూర్)*

### నీళ్లకు ఢోకా లేదు



కుంటకు మరమ్మతులు చేయకముందు నీళ్లు నిల్వక పోయేవి. వాన నీళ్లు వట్టిగనే పోయేవి. మిషన్ కాకతీయ పథకం కింద కుంటలో పూడిక తీయడంతో ఇప్పుడు నీళ్లు మస్తుగా ఉన్నయ్. ఇప్పుడు మాకు నీళ్లకు ఢోకా లేదు. కేసీఆర్ సారు చేసిన మేలుతో కుంట కింద రెండు పంటలు పండించుకుంటున్నం.

*- పూరెడి బక్కారెడ్డి, రైతు (ఇప్పల్‌నర్సింగపూర్)*

## ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రెడ్డి



కొండల్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 28: వచ్చే ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ, ఇంటింటికి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24గంటల ఉచిత విద్యుత్ లాంటి పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఈ సారి ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు.

## సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సమస్యాత్మక గ్రామాలను గుర్తించినం
- ఎలక్షన్ల సమయంలో కేసులు నమోదైతే ఇబ్బందులు తప్పవు
- జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్



పట్టణ సీఐ బర్పాటి రమేశ్

జమ్మికుంట, అక్టోబర్ 28: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు అన్ని వర్గాలు సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుందామని పట్టణ సీఐ బర్పాటి రమేశ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మికుంట మండలంలో మున్సిపల్‌తో పాటు 20గ్రామ పంచాయతీలున్నాయని తెలిపారు. మండలంలో 41 పోలింగ్ లోకేషన్‌లుండగా, అందులో 77 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 20జీపీల్లో వావిలాల, విలాసాగర్, కోరపల్లి, పాపయ్యపల్లి, పాపక్కపల్లి, మడిపల్లి, తనుగుల, శంభునిపల్లి, మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని, అసాంఘిక శక్తులపై నిఘా పెట్టామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. సరైన పత్రాల్లేకుండా రూ.50వేల మించి నగదును దగ్గర పెట్టుకోకూడదన్నారు. తనిఖీల్లో పట్టుబడితే సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఆయా పార్టీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని, ప్రచారంలో ఏ పార్టీ, నాయకుడి మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహరించకూడదని తెలిపారు. గొడవలు, దాడులు, రెచ్చగొట్టే చర్యలను సహించేది లేదన్నారు. ఎన్నికల సందర్భంగా కేసులు నమోదైతే ఇబ్బందులు తప్పవని, చట్టాలు కఠినంగా ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలో బెల్టు షాపులు నిర్వహించే వ్యక్తులు, తదితరులను బైండోవర్ చేశామని, అతిక్రమిస్తే సీరియస్‌గా తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు కొన్ని వచ్చాయని, మరికొన్ని రానున్నాయని తెలిపారు. అంతేకాకుండా స్టేషన్‌కు సంబంధించి స్థానిక పోలీసులు 25 మంది ఉన్నారని, ఎప్పటికప్పుడు శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతూనే ఉంటారని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఆయా పార్టీల అభ్యర్థులు సంయమనం పాటిస్తూ.. కార్యకర్తలను సహనంగా ఉండేలా దిశానిర్దేశం చేయాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, శక్తులపై పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్ఐలు శ్రీధర్, రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఈటలను నమ్మి మోసపోవద్దు

**గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో ఈటల దళిత బాధితుల సంఘం నాయకులు**



గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 28: మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ దళితుల జీవితాలతో చెలగాటమాడి నేడు తన స్వార్థం కోసం ఎన్నికల్లో గజ్వేల్‌లో పోటీ చేస్తున్నారని, ఆయనను నమ్మి మోసపోవద్దని ఈటల దళిత బాధితుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్ మాట్లాడారు. 'గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు రెండు చేతులతో దండం పెట్టి చెబుతున్నాం. ఈటలకు ఓటు వేయకండి. ఆయనను నమ్మి మోసపోకండి. ఈటల రాజేందర్ అక్రమ కేసులు అరాచకాలతో మా జీవితలను నాశనం చేశాడు' అని వేడుకున్నారు. గజ్వేల్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ అరాచకాలు, హత్య రాజకీయాలపై ఈటల దళిత బాధితుల సంఘం ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపడుతామన్నారు. హుజూరాబాద్ ప్రజలను మోసం చేసి గెలిచిన ఈటల మళ్లీ గజ్వేల్‌కు ఏం మొఖం పెట్టుకొని వచ్చి ఓట్లు అడుగుతాడో నిలదీయాలని ఈటల దళిత బాధితుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.